వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



మహబూబ్‌సాగర్ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. శనివారం ఆమె సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు నిండితే వరద వచ్చే ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 24 గంటల పాటు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖకు సూచించారు. చెరువుపై భాగంలో ఎక్కడైనా ఇళ్లలోకి నీరు వస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కమిషనర్, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట నీటిపారుదల శాఖ డీఈ బాల గణేష్, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జయ రామ్ తదితరులు ఉన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు దాటొద్దు

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

పుల్‌కల్, జూలై 26 ఆంధ్రజ్యోతి): పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటొద్దని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. మండల కేంద్రమైన పుల్కల్‌లోని చిట్టారెడ్డి చెరువు, పోచారం గ్రామంలోని బంగారువాని కుంటను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు, రైతులు వదర నీటి ప్రవాహం లోంచి వెళ్లేందుకు సాహసం చేయవద్దన్నారు. పుల్కల్ చిట్టారెడ్డిచెరువు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నదని, పోచారంలోని బంగారువాని కుంట తూము తెరిచి ఉండటంతో వరద నీరంతా వృథాగా దిగువకు పోతుండటంతో ఆ తూమును నిలిపివేయించారు. అంతకుముందు ఉదయం వేళ నీటి పారుదల శాఖ ఈఈ జైభీం, అందోలు సబ్ డివిజన్ డీఈఈ విక్రం, తహసీల్దార్ కృష్ణ, ఏఈఈ శకుంతల ఆయా చెరువులను సందర్శించారు. అత్యవసర సమయంలో డయల్ 100, జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739ను సంప్రదించాలని సూచించారు. ఎస్పీ వెంట సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ విశ్వజన్ తదితరులు ఉన్నారు.

సంగారెడ్డి జీజీహెచ్‌లో లీకేజీలు



సంగారెడ్డి జీజీహెచ్‌లోని ఐసీయూలో కూలిన ఫాల్ సీలింగ్ పైకప్పు

సంగారెడ్డి అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో(జీజీహెచ్) వర్షపు నీటి లీకేజీలు అక్కడక్కడ బయటపడ్డాయి. జీజీహెచ్ పాత భవనం కావడంలో పైకప్పు నుంచి వర్షపు నీరు చుక్కలు చుక్కలుగా ఉరుస్తున్నది. దీంతో ఆస్పత్రిలో అక్కడక్కడ ప్లాస్టిక్ బకెట్‌లను ఏర్పాటు చేశారు. గోడలు కూడా ముసురు వర్షానికి తడిసి ముద్దలా మారుతున్నాయి. జీజీహెచ్‌లోని ఐసీయూలో శనివారం కురిసిన వర్షానికి ఫాల్‌సీలింగ్ పైకప్పు పాక్షికంగా కూలింది. కూలిన ప్రాంతంలో రోగులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని వైద్య సిబ్బంది తెలిపారు. ఇక మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఓపీతో పాటు లోపల పలు ప్రాంతాల్లో వర్షపు నీరు కారడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా ఆస్పత్రి ఆవరణలోని గుంతల్లోనూ వర్షపు నీరు నిలవడంతో వైద్య సేవలకు వచ్చిన రోగులతో పాటు రాకపోకలు సాగించేందుకు వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.





హవేళిఘణపూర్ మండలంలో బ్రిడ్జిపై నుంచి పారుతున్న దూప్‌సింగ్ తండా వాగు, ముసురు వర్షానికి కోహీర్‌లో కూలిన ఇల్లు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం ఆగమాగమవుతున్నది. చెరువులు, కుంటలు, వాగులకు నీరు చేరుతున్నది. పలు గ్రామాల్లో వానలకు తడిసి ఇళ్లు కూలాయి. అక్కడక్కడ రోడ్లు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎండుముఖం పట్టిన పంటలకు ఈ వానలు జీవం పోశాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చేగుంటలో ఊరచెరువు దారిలో చింతచెట్టు పడి ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు



శివ్వంపేట పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



జహీరాబాద్ అల్గోల్ చౌరస్తా బైపాస్‌లో నీరు నిలిచి దెబ్బతిన్న రోడ్డు



గుమ్మడిదలలో మొన్నటి వరకు నీళ్లు లేక వాలిన మొక్కజొన్న పంటలో చేరిన వర్షం నీరు

ఆగమాగం

ఎడతెరిపి లేని వానతో జనజీవనం అస్తవ్యస్తం

పలు గ్రామాల్లో కూలిన ఇళ్లు
అక్కడక్కడ దెబ్బతిన్న రోడ్లు
రాకపోకలకు ఇబ్బందులు

నాగల్‌గిద్ద/కోహీర్/చిన్నశంకరంపేట/రేగోడు/శివ్వంపేట/చేగుంట/హవేళిఘణపూర్/జహీరాబాద్/నారాయణఖేడ్/గుమ్మడిదల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శనివారం మబ్బులు కమ్ముకుని, అక్కడక్కడ వర్షం కురిసింది. పలుచోట్ల మోస్తరు వానలు పడ్డాయి. నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలు జనజీవనాన్ని ఆగమాగం చేస్తున్నాయి. పలుచోట్ల రోడ్లు చిత్తడిచిత్తడిగా మారాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

నాలుగు మండలాల్లో కూలిన ఇళ్లు

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాలుగు మండలాల్లో పలు పాత ఇళ్లు తడిసి, తడిసి కూలిపోయాయి. నాగల్‌గిద్ద మండల పరిధిలోని గోపినాయక్ తండాలో వసరం రాందాసుకు చెందిన ఇల్లు శనివారం కూలిపోయింది. కోహీర్ పట్టణంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. పట్టణానికి చెందిన మహమ్మద్ ఫరూక్ ఇంటి పైకప్పు పూర్తిగా పడిపోగా, దావూద్‌కు చెందిన ఇంటి గోడ కూలిపోయింది. కూలిన ఇళ్లలో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం, గవ్వపల్లి తండా ఖాజాపూర్ గ్రామాల్లో పాత ఇళ్లు కూలిపోయాయి. సమచారం అందుకున్న ఆర్డీవో రమాదేవి రుద్రారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన తొర్రి సత్తయ్య ఇల్లు కూలిపోగా బాధిత కుటుంబాన్ని ఆర్డీవో పరామర్శించారు. రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామానికి చెందిన గున్న దత్తు ఇల్లు, రేగోడులో మరొక ఇల్లు కూలిపోయింది.

దెబ్బతిన్న గుర్మిల వాగు వంతెన

రాయికోడ్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కస్నూర్ - రాఘవపూర్ వెళ్లే రహదారి(గుర్మిల వాగు)పై ఉన్న వంతెన వరద ఉధృతికి దెబ్బతిన్నది. దీంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి.ఎస్ఐ మోముల చైతన్య కిరణ్ వాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇరుపక్కల వాహనాలు నిలిపివేసినట్లు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.



రాయికోడ్ మండలంలో దెబ్బతిన్న గుర్మిల వాగు వంతెనను పరిశీలిస్తున్న ఎస్ఐ

ఉధృతంగా దూప్‌సింగ్ తండా వాగు

హవేళిఘణపూర్ మండలంలోని దూప్‌సింగ్ తండాకు వెళ్లే వాగు శనివారం ఉధృతంగా ప్రవహించింది. రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం నీటి ప్రవాహం తక్కువ ఉండటంతో పాఠశాలకు ఉపాధ్యాయులు వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణానికి ప్రవాహం పెరగగడంతో తండా యువకులు టీచర్‌ను వాగుదాటించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ జగదీశ్వర్, ఈఈ నర్సింలు, మెదక్ ఆర్డీవో రమాదేవి దూప్‌సింగ్ వాగు వద్ద నీటి ఉధృతిని పరిశీలించారు. చేగుంట మండల కేంద్రంలోని ఊర చెరువుకు వెళ్లే దారిలో చింతచెట్టు విరిగిపడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. చెట్టు విరిగి కింద పడే సమయంలో చుట్టుపక్కల ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చుట్టుపక్కల కాలనీలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. శివ్వంపేట

మిగతా 8వ పేజీలో

మంజీరాకు స్వల్పంగా వరద

సంగారెడ్డి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కల్పగూర్ గ్రామానికి సమీపంలోని మంజీరా బ్యారేజీలోకి స్వల్పంగా వరద నీరు చేరింది. ఇప్పటివరకు 0.8 టీఎంసీల వరద చేరింది. ప్రస్తుతం నీటి ప్రవాహం స్వల్పంగానే ఉండగా, నీటి ప్రవాహం అధికమై 1.5 టీఎంసీల నీరు చేరినట్లయితే గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదులుతామని బ్యారేజ్ డీఈ అజీజ్ బేగ్ తెలిపారు. బ్యారేజ్ పరిసర ప్రాంతాల్లోకి పర్యాటలకులకు తాత్కాలికంగా అనుమతిని నిలిపివేశామని పేర్కొన్నారు. అదేవిధంగా సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



ముందస్తు చర్యలు తీసుకోవాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి శరత్

సంగారెడ్డి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాల నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి శరత్ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి శనివారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు లోటు లేకుండా అందించాలన్నారు. అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ బడులు, వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతతో కొత్త మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ మాధురి, అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇళ్లను గుర్తించాలి

నర్సాపూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి శరత్ అధికారులను ఆదేశించారు. శనివారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు, కుంటలను పరిశీలించి ఎక్కడైనా లీకేజీలు, గండ్లు పడే అవకాశం ఉంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నర్సాపూర్ రాయరావు చెరువును సందర్శించారు. సమావేశంలో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, డీఈవో రాధాకిషన్, ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్లు, తదితరులుపాల్గొన్నారు.



శివ్వంపేట పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి శరత్

పీహెచ్‌సీ పరిశీలన

శివ్వంపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శరత్ శనివారం శివ్వంపేటలో పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ మందులు సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ నగేష్, డీఎంహెచ్‌వో శ్రీరామ్, ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ కమలాద్రిచారి, వైద్యులు పవన్‌కుమార్, సాయిసౌమ్య ఉన్నారు.



సందర్శకులు లేక వెలవెలబోతున్న మ్యూజియం

ఈ చరిత్ర ఏ సిరాతో..!

కొండాపూర్‌లో 85 ఏళ్ల క్రితం మ్యూజియం ఏర్పాటు

మరమ్మతుల పేరిట మూసివేత

ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో విలువైన సంపద

ఏడాదిగా పట్టించుకునే వారే లేరు

అసలున్నాయో.. లేవో.. పట్టని పురావస్తుశాఖ

చెదలుపట్టిస్తున్నారు..

7 సండే స్పెషల్ Sunday Special

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

● సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డా.నాగనిర్మల

సంగారెడ్డి అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందిచడమే లక్ష్యంగా పనిచేస్తానని సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డా.కె.నాగనిర్మల తెలిపారు. శనివారం సంగారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సేవల అములులో జిల్లా మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తానన్నారు. అంతకుముందు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్ ప్రావీణ్యతో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

పటాన్‌చెరు మార్కెట్‌లో అవినీతి బాగోతం

● అధికారుల నిర్వాకంతో కోట్లాది రూపాయలు హాంఫట్

● రద్దైన దుకాణాల లైసెన్సుల పునరుద్ధరణలో అక్రమాలు

● విజిలెన్స్ విచారణతో వెలుగులోకి..

పటాన్‌చెరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మార్కెట్ కమిటీలో అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి, అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయలు దండుకున్న వైనం సంచలనం రేపుతోంది. పాలకమండళ్ల రద్దు కావడాన్ని అదనుగా చేసుకున్న కొందరు అధికారులు, రద్దు చేసిన దుకాణాలకు అక్రమంగా లైసెన్సులు పునరుద్ధరించి, వసూలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగా, బాధ్యులైన అధికారిని పటాన్‌చెరు నుంచి బాటసింగారం మార్కెట్‌కు బదిలీ చేయడం గమనార్హం.



తెరుచుకోని ఉల్లిపాయల లైసెన్స్‌దారుల దుకాణాలు

పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డు సముదాయంలో 318 దుకాణాలున్నాయి. కూరగాయలు, ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపారంతో మార్కెటింగ్ శాఖకు ఏటా రూ.7 కోట్ల ఆదాయం సమకూరుతోంది. కూకట్‌పల్లి నుంచి పటాన్‌చెరు వరకు, సంగారెడ్డి నుంచి కూడా వ్యాపారులు, వినియోగదారులు ఇక్కడికి వస్తుండడంతో దుకాణాలకు

మిగతా 8వ పేజీలో

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ **గోబెల్స్ ప్రచారం**

బీసీలకు బీజేపీ ఏం చేసిందో చెబుతా

కాంగ్రెస్ ఏం చేసిందో చెబుతారా?

పీసీసీ చీఫ్, ప్రభుత్వ విప్‌లకు ఎంపీ రఘునందన్‌రావు సవాల్

7

అర్హులందరికీ రేషన్‌కార్డులు

ఇది నిరంతర పక్రియ

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

గౌరవెల్లికి గోదారి వచ్చేనా?

- మెట్ట ప్రాంత రైతుల ఎదురుచూపు
- కాలువల కోసం భూ సేకరణ చేస్తున్న అధికారులు
- ఎప్పటికి పూర్తయ్యేనో..

అక్కన్నపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి రిజర్వాయర్ అడుగడుగునా అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఉద్రిక్త పరిస్థితుల మధ్య పనులు కొనసాగినా రైతాంగానికి మాత్రం ఇంకా సాగునీరు అందించలేకపోతోంది. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే ప్రాజెక్టు కాలువల పూర్తికి అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధిహామీ ద్వారా కాలువల జంగల్ కటింగ్‌ను పూర్తిచేశారు. మంత్రి చొరవతో ప్రాజెక్టు పూర్తికి నిధులు రూ.431 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామాలకు సాగునీరు సరఫరా చేసే కాలువల కోసం భూసేకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ, ఆయన బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నర్ర కావొస్తుండగా, గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు వచ్చేనా అంటూ రైతులు చర్చించుకుంటున్నారు. పనులు పూర్తయ్యేది ఎన్నడో.. సాగునీరు అందిందే ఎప్పుడో అని అంటున్నారు.

95శాతం పనులు పూర్తి..

గౌరవెల్లి ప్రాజెక్టు 95శాతంపైగా పనులను పూర్తి చేసుకుని అధికారులు ట్రయల్ రన్ చేసి గోదావరి జలాలను ప్రాజెక్టులోకి వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. 2007లో 1.43 టీఎంసీతో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో అప్పటి సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ సామర్థ్యాన్ని 8.24 టీఎంసీలకు పెంచుతూ రీడిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. భూనిర్వాసితులకు పరిహారం పెంచి ఇవ్వాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర డిమాండ్లపై ముంపు బాధితులు దశలవారీగా ఆందోళనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టి ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వం ఎలాగైనా ప్రాజెక్టును పూర్తిచేయాలని సంకల్పంతో భూనిర్వాసితులు, ముంపు బాధితులతో చర్చలు జరిపి వారికి రావాల్సిన పరిహారాలను అందించింది. ఎన్నో అడ్డంకులు, ఆందోళనలు, లాఠీచార్జీలు, పోలీస్ కేసులు, అరెస్టులు, జైలు శిక్షలు అనుభవించిన ముంపు బాధితులు శాంతించడంతో దశాబ్దాలుగా నీళ్ల కోసం ఎదురుచూస్తున్న మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు నీళ్లు వస్తాయని రైతులు ఆశ పడగా ఎన్జీటీ ఆదేశాలతో పిడుగు పడింది. దీంతో అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా పనులు నిలిపివేసింది. దీంతో రైతులు నిరుత్సాహం చెంది ఇక ప్రాజెక్టు పనులు పూర్తయి సాగునీరు వస్తుందో లేదోననే ఆందోళనకు గురయ్యారు. అంతలోనే శాసనసభ ఎన్నికలు జరిగి హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, కేబినెట్‌లో రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్‌కు అవకాశం దక్కడంతో ఆయన గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్జీటీలో కేసు ఉండడంతో మూడు అడుగులు వెనక్కి.. ఆరు అడుగులు ముందుకు అన్నట్లు కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం చేసుకుంటున్నారు.



గౌరవెల్లి ప్రాజెక్టు

పోలీసులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యం ఉండాలి

కంది, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న సమాజానికి అనుకూలంగా పోలీసులకు ఆధునిక సాంకేతికపై నైపుణ్యం ఉండాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శనివారం కంది మండల పరిధిలోని ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల మెయింటెనెన్స్‌ను పరిశీలించి, మాట్లాడారు. పెండింగ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఇన్వెస్టిగేషన్‌లో ఎలాంటి సందేహాలున్న ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని ఎస్‌హెచ్‌వోకు సూచించారు. ఈ తనిఖీలో ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి, ఏఎ్‌సఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.



ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

టేక్మాల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. శనివారం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పరిసరాలను పరిశీలించి, మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

బొమ్మారెడ్డిగూడెం ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

పుల్‌కల్, జూలై 26 ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ షోకాజ్ నోటీస్‌లు జారీచేశారు. శనివారం ఆమె పాఠశాల సందర్శించారు. ఉదయం ప్రార్థనా సమయంలోగా పాఠశాలకు చేరుకోవాల్సిన ఉపాధ్యాయులు పుష్పలత, అనురాధ, జ్యోతి ఆలస్యంగా విధులకు హాజరవడంతో ముగ్గురికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు. ప్రార్థనా సమయంలో ముగిశాక విధులకు హాజరవ్వడమేంటని సదరు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రార్థనా సమయానికంటే ముందుగానే విధులకు హాజరుకావాలన్నారు.



బొమ్మారెడ్డిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల

రెండురోజుల మగశిశువు మృతదేహం లభ్యం

- వివరాల సేకరణలో పోలీసులు

జహీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శనివారం రెండురోజుల మగశిశువు మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు ఆస్పత్రి ఆవరణలో గల ఓ హోటల్ వద్ద చిన్నారి మృతదేహాన్ని వదిలేసి పోయారు. స్థానికుల సమాచారం మేరకు ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించామన్నారు. సీసీ కెమెరాలు, మృతిచెందిన శిశువు కాలికికట్టిన చీటీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. శిశువు ఆస్పత్రిలోనే మృతిచెందాడా లేక ఎక్కడైనా చనిపోయాడా..? పడేయడానికి గల కారణాలు ఏంటనే దానిపై ఆరాతీస్తున్నారు. ఈ నెల 25న మగశిశువు జన్మించినట్లు కాలికి కట్టిన చీటీ ఆధారంగా తెలుస్తుందన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని వారు వివరించారు. ఆస్పత్రి ఆవరణలో మగశిశువు మృతదేహం లభించడం పట్టణంలో కలకలం రేపింది.



శిశువు మృతదేహం

ఎండు గంజాయి, గోవా మద్యం పట్టివేత



పోలీసుల అదుపులో గంజాయి సరఫరా చేస్తున్న నిందితులు

మునిపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ వైపు సరఫరా చేస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ మెదక్ డిప్యూటీ కమిషనర్ హరిక్రిష్ణ ఆదేశాల మేరకు శనివారం మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద టాస్క్‌ఫోర్స్ సీఐలు శంకర్, చంద్రశేఖర్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఓ ఆటోపై అనుమానం వచ్చి విచారించగా అందులో 501 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొయినాబాద్, లంగర్‌హౌస్‌కు చెందిన కంచె రాకేష్, నాంపల్లి శుభం, ధర్మరాజు, సాయికుమార్, పోరంపల్లి శ్రీకాంత్ అక్రమంగా బీదర్‌లో ఎండు గంజాయిని కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. పట్టుబడిన గంజాయితో పాటు ఆటో, నాలుగు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే గోవా నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తుండగా వివిధ బ్రాండ్లకు సంబంధించిన 3.30 లీటర్స్ సుంకం చెల్లించని మద్యాన్ని స్వాధీనం చేసుకొని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్‌ఫోర్ ఎస్ఐలు హనుమంత్, అనుదీప్, అనిల్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి కేసులోని నిందితులకు రిమాండ్

మునిపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక నుంచి తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు పోలీసుశాఖ గట్టి నిఘా పెట్టిందన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ బక్కన్న, కానిస్టేబుల్ హనీఫ్, పాండు, డ్రైవర్ సునీల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జిన్నారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ నెల 18 గడ్డపోతారం మున్సిపాలిటీ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న శివరాముడు(39) ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించగా.. శనివారం మృతిచెందాడని చెప్పారు. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న నాగేశ్వరరావు చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరూ మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందినవారని సీఐ చెప్పారు. మృతుడి కుమారుడు అగ్నేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

యువకుడు అదృశ్యం



శ్రీచక్రారెడ్డి

పటాన్‌చెరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్వ్యూకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ వివరాల ప్రకారం.. హైదరాబాద్ మీర్‌పేటకు చెందిన శ్రీచక్రారెడ్డి అనే యువకుడు బీటెక్ పూర్తిచేశాడు. ఈనెల 21న పటాన్‌చెరులో ఓ కంపెనీలో ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ

- ఆరు తులాల బంగారం, రూ.లక్ష అపహరణ

హత్నూర, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలు ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దోచుకెళ్లిన సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ శుక్రవారం ఉదయం కుంటుంబీకులతో కలిసి నర్సాపూర్ సమీపంలోని చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తలుపులు తెరిచి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఆరు తులాల బంగారు నగలు, రూ.లక్ష నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన శేరి ఆంజనేయులు కుటుంబంతో కలిసి శుక్రవారం ఉదయం బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టడంతో పాటు బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, క్లూస్ టీం సిబ్బంది ఆ రెండు ఇళ్లలో క్షుణ్ణంగా పరిశీలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.



ఇంట్లో వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

పాఠశాల వాటర్‌ట్యాంకులో చనిపోయిన కోతి

- విషయం తెలిసి తీసి శుభ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా నర్సాపూర్ జూనియర్ కాలేజీ ఆవరణలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వాటర్ ట్యాంకులో చనిపోయిన కోతి మృతదేహం స్థానికంగా కలకలం రేపింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వాటర్‌ట్యాంకుకు మూత లేక తెరిచి ఉండటంతో కోతి అందులో పడి చనిపోయినట్టు సమాచారం. అది ఎవరు గమనించకపోవడంతో ఎన్ని రోజులుగా అందులో ఉందో ఎవరికీ తెలియని పరిస్థితి. అయితే శనివారం ట్యాంకులో చనిపోయిన కోతి ఉన్న విషయం గుర్తించి దానిని స్థానిక వాట్సాప్ గ్రూపులో పెట్టడంతో విషయం వెలుగుచూసింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది వెంటనే వెళ్లి ట్యాంకులో చనిపోయిన కోతిని తీసి ట్యాంకును శుభ్రం చేశారు.

సిగాచి ఆస్తులు జప్తు చేయాలి



కర్మాగారాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

రామచంద్రాపురం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : బాధిత కార్మికులకు పరిహారం చెల్లింపు విషయంలో జాప్యం చేస్తున్న సిగాచి కంపెనీ ఆస్తులు జప్తు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, పాండురంగారెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురంలోని కర్మాగారాలశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేసి మాట్లాడారు. పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి 25 రోజులు గడుస్తుందన్నారు. ఒకే విడతలో రూ.కోటి చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పి. నేటికీ చెల్లింపులు జరగలేదని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా ప్రకటన చేసినా అమలు కాలేదని వివరించారు. క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఇస్తామన్నారు నేటికీ ఎటువంటి చెల్లింపులు జరగడం లేదని వివరించారు. ఆచూకీ తెలియని ఎనిమిది మంది కుటుంబాలకు రూ.15 లక్షలు చెల్లించారని వివరించారు. కంపెనీల్లో భద్రత పట్ల అధికారులు పూర్తిస్థాయి నిర్లక్ష్యంతో వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు సత్తిబాబు, వీరారావు, మధుకర్‌రెడ్డి, రామకృష్ణ, గంగాధర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై 'కాంగ్రెస్' గోబెల్స్ ప్రచారం

- బీసీలకు బీజేపీ ఏం చేసిందో చెబుతా
- కాంగ్రెస్ ఏం చేసిందో చెబుతారా?
- పీసీసీ చీఫ్, ప్రభుత్వ విప్‌లకు ఎంపీ రఘునందన్‌రావు సవాల్



సంగారెడ్డిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై మూడురోజులుగా 'కాంగ్రెస్' పార్టీ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దుయ్యబట్టారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్న దశాబ్దాలలో బీసీలకు బీజేపీ ఏం చేసిందో నేను చెబుతానని, మరి కాంగ్రెస్ ఏం చేసిందో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, విప్ ఆది శ్రీనివాస్‌లకు ఆయన సవాల్ విసిరారు. బీసీలకు ఏం చేశామో గణాంకాలతో ఎక్కడికి రమ్మంటే అక్కడికి చర్చకు వస్తానని మీరు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మంత్రి వర్గాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలని, 56 శాతం బీసీలు ఉంటే ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వడం కరక్టేనా అని విప్ ఆది శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 250 మందిని కాంగ్రెస్ సీఎంలను చేస్తే అందులో 43 మంది ఓబీసీలే ఉన్నారన్నారు. బీజేపీ 68 మంది సీఎంలను చేస్తే అందులో 21 మంది ఓబీసీలు ఉన్నారన్నారు. 31 శాతం ఓబీసీలను బీజేపీ సీఎంలుగా చేసిందని, 17 శాతం మందిని మాత్రమే కాంగ్రెస్ సీఎం చేసిందని వివరించారు. ఎన్డీఏ కూటమిలో 20 మంది సీఎంలు ఉంటే ఐదుగురు ఓబీసీ, ముగ్గురు ఎస్టీలు, ఇద్దరు మైనార్టీలు సీఎంలుగా ఉన్నారన్నారు. మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో కేవలం ఇద్దరు ఓబీసీలు మంత్రులుగా ఉన్నారని, మోదీ క్యాబినెట్‌లో 21 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారన్నారు. దేశానికి రాష్ట్రపతిగా దళితులను, గిరిజనులను చేసిన ఘనత బీజేపీదే అన్నారు. తెలంగాణకి రెండు కేంద్ర మంత్రి పదవులు ఇస్తే ఒక బీసీకి మంత్రి పదవి బీజేపీ ఇచ్చిందన్నారు. కేటీఆర్, ఎంపీ సీఎం రమేశ్ ఎపిసోడ్‌పై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. హెచ్‌సీయూ భూముల విషయంలో బీజేపీ ఎంపీలపై కేటీఆర్ బట్టకాల్చి మీద వేశారన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తనపై కేటీఆర్ మొదట ఆరోపణలు చేశారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర నాయకులు సంగప్ప, జగన్ తదితరులు పాల్గొన్నారు.



మ్యూజియంలో రెండో ప్రదర్శనను మూసిన ఉంచిన గది


పురావస్తు వస్తువుల చూపే ప్రదర్శన ఖాళీ బ్లాకు

సండే స్పెషల్ Sunday Special

ఈ చరిత్ర ఏ సిరాతో..!

- చెదలు పట్టిస్తున్నారు..
- 85 ఏళ్ల క్రితం మ్యూజియం ఏర్పాటు
- మరమ్మతుల పేరిట మూసివేత
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో విలువైన సంపద
- ఏడాదిగా పట్టించుకునేవారు కరువు
- అసలున్నాయో.. లేవో.. పట్టని పురావస్తుశాఖ

కొండాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాకు చరిత్రలో ఓ పేజీ ఉంది. మెతకుసీమగా పేరున్న ఈ జిల్లాలో శాతవాహనుల కాలం నాటి చిహ్నాలున్నాయి. గౌతమిపుత్ర శాతకర్ణి, వశిష్ట పుత్ర పులుమావి, శివశ్రీ, యజ్ఞశ్రీ శాతకర్ణిల కాలం నాటి విలువైన వస్తువులు లభించాయి. అలాగే, ఆది మానవుడి కాలం నాటి పనిముట్లు, బౌద్ధ చైత్యాలు, విహారాలు, స్థూపాలు, మఠాలు ఉమ్మడి జిల్లా సిగలో ఒకప్పటి నగలు. ఇంతటి విలువైన వస్తువులన్నింటినీ ఒకచోట చేర్చి వాటిని పరిరక్షించేందుకు నిజాంల కాలంలోనే ఇక్కడ మ్యూజియం నిర్మించి పహారా కూడా ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పుడవి సురక్షితంగా ఉన్నాయో.. అసలు ఉంటే ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాయో కూడా తెలియడం లేదు. కారణం మరమ్మతుల పేరుతో జిల్లాలోని కొండాపూర్ మ్యూజియాన్ని ఏడాది క్రితం మూసివేశారు. అప్పటి నుంచి అటువైపు ఎవరినీ వెళ్లనివ్వడం లేదు. నలుగురు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసిన అధికారులు.. కనీసం మరమ్మతు పనులు చేపట్టారా అంటే అదీ లేదు.

85 ఏళ్ల క్రితం తవ్వకాలు

1040-41లో బ్రిటీష్ పురావస్తు పరిశోధకుడు హెన్రీ కౌసెన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో తవ్వకాలు జరపగా, విలువైన చారిత్రక ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ ప్రాంతాన్ని శాతవాహనులు కౌండిన్యపురం(నేటి కొండాపూర్)ను కేంద్రంగా చేసుకుని రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జరిపినట్లు చరిత్ర చెబుతోంది. నాటి తవ్వకాల్లో ఆదిమానవుడి పనిముట్లు, దేవతామూర్తుల విగ్రహాలు లభించాయి. అలాగే, 1970 నుంచి 74 వరకు, 2009 నుంచి 2011 వరకు ఈ ప్రాంతంలో పురావస్తు తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో శాతవాహనుల కాలం నాటి విలువైన వస్తువులు, బౌద్ధ మత ఆనవాళ్లు, రాతియుగం నాటి బంగారు, వెండి నాణెలు దొరికాయి.

నిజాం కాలంలోనే మ్యూజియం

ఈ ప్రాంతంలోని లభించిన వస్తువులను భద్రపరిచేందుకు నిజాం కాలంలోనే మ్యూజియం ఏర్పాటు చేశారు. చరిత్రను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో పక్కా భవనం నిర్మించి, అప్పట్లోనే పహారా ఏర్పాటు చేశారు. నిజాం కాలంలో రెండుసార్లు, భారత ప్రభుత్వం హయాంలో మూడుసార్లు జరిపిన తవ్వకాల్లో బయటపడ్డ వస్తువులను ఇక్కడ భద్రపరిచారు. ప్రజల సందర్శనార్థం ఏర్పాట్లు చేశారు. దీంతో ఈ ప్రాంతం పర్యాటక ప్రదేశంగా మారింది.

చెదలు పట్టిస్తున్నారు..

కొండాపూర్ మ్యూజియం ఉన్న భవనం వర్షం వస్తే ఉరుస్తుందని మరమ్మతుల పేరిట మూసేశారు. మ్యూజియంలోని రెండు బ్లాక్‌లను ఖాళీగా ఉంచి, ఓ గదిలో వస్తువులను పక్కన పెట్టారు. ఏడాది క్రితం వరకు ఈ మ్యూజియం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, ఏడాదిగా ఇన్‌చార్జిలతో ప్రైవేట్ సెక్యూరిటీని పెట్టారు. సందర్శకులనూ అనుమతించకపోవడంతో ఒకప్పుడు వివిధ ప్రాంతాల వారితో కళకళలాడిన ఈ మ్యూజియం ఇప్పుడు చిన్నబోయింది. ప్రధాన గేటుకు తాళం వేసి ఉండటంతో అటువైపు వెళ్లే వారే లేకుండా పోయారు. దీంతో మ్యూజియంలోని విలువైన వస్తువులు ఉన్నాయో.. ఉంటే ఎలా ఉన్నాయో తెలియడం లేదు.


నిజాం ప్రభుత్వం 1940లో వస్తువుల ప్రదర్శనకు నిర్మాణాలు చేపట్టి పహారాతో సెక్యూరిటీ(ఫైల్)


సందర్శకులు లోపలి రాకుండా మెయిన్ గేటుకు తాళం వేసిన దృశ్యం

వస్తువులకు భద్రత ఎక్కడ



పురావస్తు తవ్వకాల్లో దొరికిన విలువైన వస్తువులకు భద్రత లేకుండా పోయింది. నిజాం కాలంలో, భారత ప్రభుత్వ హయాంలో జరిగిన తవ్వకాల్లో బయటపడ్డ వస్తువులను పదిలపర్చాల్సి ఉండగా, ఏడాదిగా పట్టించుకోవడం లేదు. ఈ మ్యూజియంను ప్రైవేట్ సెక్యూరిటీకి వదిలేశారు.

\- నర్సింలు, మాజీ సర్పంచ్, హరిదాస్‌పూర్



తాడూరుకు బదులుగా తాండూరుగా ఉన్న బోర్డు

హవ్వా.. ఇవేం పేర్లు..!

- జాతీయ రహదారి వెంట తప్పుల తడకగా నేమ్‌బోర్డులు
- గ్రామాల పేర్లు మార్చేయడం పట్ల స్థానికుల విస్మయం

చేర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట-సిరిసిల్ల 365బీ జాతీయ రహదారిలో కొన్నాళ్ల క్రితం చేపట్టిన జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తికావచ్చాయి. ఈ నేపథ్యంలో జనగామ నుంచి దుద్దెడ క్రాస్‌రోడ్డు వరకు దారి పొడవునా గల ఆయా గ్రామాల పేర్లతో నేమ్ ప్లేట్లు ఏర్పాటు చేస్తున్నారు. కానీ అసలు పేర్లకు సరిపోలక ఇంగ్లిస్, తెలుగు మాధ్యమంలో అక్షర దోషాలుండటంతో అర్థాలు మారిపోతున్నాయి. చేర్యాల పట్టణం నుంచి చుంచనకోట, నర్సాయపల్లి గ్రామాలకు వెళ్లేదారిలో చుంచంకోట, నర్సయ్యపల్లి అని, తాడూరు క్రాస్ రోడ్డు తాడూరుకు బదులు తాండూరు, మర్రిముస్త్యాలకు బదులు మర్రిముస్తియల అన్న బోర్డులు ఏర్పాటు చేయడంపై స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ప్రయాణించేవారు అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు నిద్ర మత్తువీడి నేమ్‌బోర్డులను సవరించి ఆయా గ్రామాల ప్రాశస్త్యాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.



చుంచనకోటకు బదులు చుంచంకోటగా ఉన్న బోర్డు

అర్హులందరికీ రేషన్‌కార్డులు : మెదక్ కలెక్టర్

తూప్రాన్/ మనోహరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డితో కలిసి శనివారం ఆయన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లాలో 9,900 కుటుంబాలకు కొత్తగా రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు. రేషన్‌షాపుల్లో నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్నారని, తాను పలు చోట్ల భోజనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాచారం ఆలయ చైర్మన్ పల్లెర రవీందర్ గుప్తా, ఆర్డీవో జయచంద్రారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎస్‌వో నిత్యానంద, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. నానో యూరియా, నానో డీఏపీ వాడాలని అవగాహన కల్పిస్తున్న రైతు ఆగ్రోస్ సేవా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు.

మనోహరాబాద్ మండలంలోని రైతు వేదికలో సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి లబ్ధిదారులకు ఆయన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్, ప్యాక్స్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.


మనోహరాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బురద రోడ్డులో ఎలా నడిచేది..?

శివ్వంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాలతో బురద రోడ్డులో నడవలేక ఇబ్బంది పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గిరిజనులు రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన నవాబ్‌పేట్ రాములుతండాలో శనివారం చోటుచేసుకుంది. మండల పరిధి నవాబ్‌పేట పంచాయతీ పరిధి లోని రాములుతండాకు నవాబ్ పేట్ గ్రామం నుంచి ఉన్న ప్రధాన రోడ్డు రెండు కిలోమీటర్ల మేర బురదమయంగా మారింది. దీంతో వాహనదారులతో పాటు కాలినడకన వెళ్లే వారు సైతం అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో గిరిజనులు శనివారం రోడ్డుపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రెండు, మూడేళ్లుగా రోడ్డు విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


శివ్వంపేట మండలం రాములుతండాలో బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- వ్యవసాయ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్

కంది, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారులతో కలిసి కంది పీఏసీఎస్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పీఏసీఎస్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, నానో యూరియా, విత్తనాలు స్టాక్‌పై ఆరా తీశారు. రికార్డులు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా రైతులకు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏడీఏ వెంకటలక్ష్మి, ఏవో శ్రీనివాస్, సీఈఓ మందాడ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో నాగుపాము కలకలం

శివ్వంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్‌లోని నాగుపాము రాగా చిన్నారులు భయాందోళన చెందారు. టీచర్ అప్రమత్తతతో చిన్నారులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటన మండలంలోని పిల్లుట్ల అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగింది. టీచర్ విజయలక్ష్మి కథనం ప్రకారం.. పిల్లుట్ల అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం నాగుపాము వచ్చింది. పిల్లలంతా దానిని చూసి భయపడిపోయారు. ఆ సమయంలో టీచర్ విద్యార్థులందరినీ బయటకు తీసుకువచ్చారు. గ్రామ కార్యదర్శి నాగేష్‌కు ఫోన్ చేయగా, ఆయన పారిశుధ్య కార్మికులను పంపించారు. వారు వచ్చి పామును చంపివేశారు.


పిల్లుట్ల అంగన్‌వాడీ సెంటర్‌లో చంపేసిన నాగుపాము

శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయి అవార్డు

మెదక్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్, మాగ్నిస్ డయాగ్నొస్టిక్ సంస్థల పక్షాన ఉచిత ఆరోగ్య శిబిరాల్లో ముందు వరుసలో నిలిచిన మెదక్ మండలం రాయిన్‌పల్లి ప్రాంతానికి సింగం శ్రీనివాసరావుకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. శనివారం నగరంలోని ఓ కన్వెన్షన్‌హాల్లో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. శ్రీనివాస్‌రావు కొన్నాళ్లుగా పేద రోగులకు హెల్త్ క్యాంపుల ద్వారా సేవలందిస్తున్నాడు. ఆ సేవలను గుర్తించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది.



హైకోర్టు న్యాయమూర్తి నుంచి అవార్డు అందుకుంటున్న సింగం శ్రీనివాసరావు

సమస్యల సంద్రంలో.. దుబ్బాక రామసముద్రం

- అసంపూర్తి పనులతో ఆగమైన చెరువు
- చెరువంతా గుర్రపుడెక్క తూటిచెట్లు
- పట్టించుకోని అధికారులు

దుబ్బాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యమో.. కాంట్రాక్టర్ అలసత్వమో కానీ దుబ్బాక మండలంలోని రామసముద్రం సుందరీకరణకు నోచుకోవడం లేదు. 2016లో చెరువు సుందరీకరణకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.5 కోట్లను మంజూరు చేశారు. అంతేకాక మున్సిపల్‌శాఖ నుంచి సుమారు రూ.50 లక్షలతో పిల్లల పార్కు, మరో రూ.60 లక్షలతో జిమ్‌ను ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై రేలింగ్‌వాల్, పారాపిట్‌వాల్, బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి, కాలువ, గ్రీనరీ తదితర పనులకు రూ.4.80 కోట్లతో మిషన్ కాకతీయ ద్వారా ఇరిగేషన్‌శాఖ పూర్తిచేసింది. మరుగుదొడ్ల నిర్మాణం, చిల్డ్రన్‌పార్క్, జిమ్‌ను మున్సిపల్ శాఖ ప్రత్యేక నిధుల ద్వారా చేపట్టింది. అయితే ఇంకా రూ.60 లక్షల వరకు పనులు చేపట్టాల్సి ఉన్నది. అదేవిధంగా మొత్తం సుందరీకరణకు ఇంకా రూ.2 కోట్లు అవసరం ఉన్నాయి. అయితే కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.40 లక్షల బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో రామసముద్రం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

చెరువంతా గుర్రపుడెక్క

ప్రభుత్వం బిల్లులు, నిధులు విడుదల చేయడంతో చెరువు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో చెరువు గుర్రపు డెక్కతో నిండిపోయింది. అలాగే తుమ్మచెట్లు కూడా మొలిచాయి. రెండేళ్ల క్రితం గుర్రపు డెక్కను, తుమ్మచెట్లను తామే తొలగించామని మత్స్యకారులు చెబుతున్నారు.


గుర్రపుడెక్కతో నిండిన దుబ్బాక రామసముద్రం చెరువు

మూలనపడిన చిల్డ్రన్ పార్క్

చెరువు కట్టపై రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన జారుగు బండ, ఊయ్యాలలు, గుర్రపు స్వారీ కుర్చీలు, తదితర ఆట వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే ఎవరూ పట్టించుకోకపోవడంతో పార్కు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. అక్కడికి వెళ్లాలంటేనే చిన్నారులు జంకుతున్నారు.

చెడిపోయిన బోటింగ్

పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో రామసముద్రం చెరువులో ఏడేళ్ల క్రితం పర్యాటకశాఖ పడవలను తెచ్చింది. ఇందుకు స్థానికంగా ఇద్దరు మత్స్యకారులకు శిక్షణ కూడా ఇచ్చి.. తాత్కాలికంగా నియమించారు. కానీ వారికి పర్యాటక శాఖ వేతనాలు అందించలేదు. దీంతో బోటింగ్ కోసం తెచ్చిన పడవలు మూలనపడి చెడిపోయాయి.

వాకర్స్‌కు ఉపయోగపడని జిమ్

చెరువు కట్టపై వాకర్స్ నడిచే ప్రాంతంలో టైల్స్ పూర్తిగా వేయకపోవడంతో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన జిమ్ నిరుపయోగంగా ఉన్నది. వాకర్స్ నడిచే దారివెంట మొక్కలు మొలిచాయి. తరచూ పాములు కనిపిస్తుండడంతో వాకర్స్ భయపడుతున్నారు. అలాగే రూ.10 లక్షలతో సుమారు కిలోమీటరు చుట్టూ ఉండే చెరువుకు రెయిలింగ్ వేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో దొంగలు కట్ చేసుకుని వెళ్లిపోతున్నారు.


నిర్వహణ లేక మూలనపడిన అల్ట్రా మోడ్రన్ మరుగుదొడ్లు

నిరుపయోగంగా టాయిలెట్లు

పర్యాటకుల సౌకర్యార్థం 2020లో రూ.10 లక్షలతో చెరువుపై అల్ట్రా మోడ్రన్ మరుగుదొడ్లు నిర్మించారు. వీటి నిర్వహణ సరిగ్గా లేక చుట్టూ చెట్లు, పొదలు పెరిగాయి. కనీసం నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం రామసముద్రం కాలుష్య కాసారంగా మారింది. దుబ్బాకలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉండటంతో రంగులు అద్దే నైట్రేట్, రసాయనాలు చెరువులోకి చేరుతున్నాయి. దశాబ్దకాలం నుంచి రామసముద్రం చెరువు సుందరీకరణ పనులు నత్తనడకన సాగడం పలు విమర్శలకు తావిస్తుంది.

గజ్వేల్‌లో ఐదు ఇళ్లలో చోరీ

- బంగారం, వెండి వస్తువులు మాయం
- క్లూస్ టీంతో విచారణ చేపట్టిన పోలీసులు

గజ్వేల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఏకంగా ఐదు ఇళ్లలో చొరబడి బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇళ్లలోని వస్తువులను చిందరవందరగా పడేసి, బంగారు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. పట్టణంలోని ధనలక్ష్మి కాలనీకి చెందిన పసునూరి నవనీత్ భర్త అనారోగ్యానికి గురవగా, 15 రోజులుగా హైదరాబాద్‌లోని కుమారుడి ఇంట్లో ఉంటూ అక్కడే చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి నవనీత కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే గజ్వేల్‌కు చేరుకున్న వారు ఇంట్లోని 15 గ్రాముల బంగారం అపహరించుకుపోయినట్లు గుర్తించారు. వాసవీనగర్‌కు చెందిన హనీఫ్ రామాయంపేటలో వ్యవసాయ పనుల నిమిత్తం పది రోజుల క్రితం వారి ఇంటికి తాళం వేసి వెళ్లారు. శనివారం ఉదయం తలుపులు తెరచి ఉండటంతో ఎదురుగా ఉండే వారి బంధువులు గమనించి హనీఫ్‌కు సమాచారం అందించారు. వెంటనే గజ్వేల్‌కు చేరుకుని ఇంటిని పరిశీలించి రూ.10 వేల విలువైన వెండి వస్తువులను ఎత్తుకు వెళ్లినట్లు గుర్తించారు. మహ్మద్‌షాదుల్లా తన కింద అంతస్తులో తాళం వేసి పైన అంతస్తులో నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా, తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించి, లోనికి వెళ్లి చూశారు. రూ.15 వేల నగదు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. మరో రెండు ఇళ్లలో సైతం దుండగులు చొరబడినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు క్లూస్ టీంతో విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.


గజ్వేల్‌లో ఓ ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

న్యూస్ బాక్స్

మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మునిపల్లి, జూలై26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుదేరా చౌరస్తాలో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్సీ కేటగిరిలో మిగిలిన సీట్లను డిగ్రీ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు కోసం ఎస్సీ మహిళా విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బోళ్ల మాధవి తెలిపారు. కళాశాలలో బీకాం, బీఏ జనరల్, ఆనర్స్, బీఏ, ట్రాన్సేషన్, బీబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలలో సంప్రందించవచ్చని తెలిపారు. వివరాలకు 8688993022, 9121004525 గల నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కస్తూర్బా ఇంటర్మీడియట్‌లో...

రేగోడు జూలై26(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికల విద్యాలయం, కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ప్రత్యేక అధికారి స్వయంప్రభ శనివారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీలో 20 సీట్లు, బైపీసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడిగా హన్మంతరావు పటేల్



మెదక్ అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మెదక్ జిల్లా శివ్వంపేట మండలానికి చెందిన కల్లూరి హన్మంతరావు పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న మున్నూరు కాపుల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడితోపాటు సంఘ ముఖ్య నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హన్మంతరావు నియామకం పట్ల సంఘ నాయకులు, ప్రముఖ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

బీసీ గురుకులంలో కంటి పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నలందా నగర్‌లోని మహాత్మజ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో జేకే ఫెన్నార్ కంపెనీ సహకారంతో విద్యార్థులకు కంటి పరీక్షలు శనివారం నిర్వహించారు. సుమారు 392 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు.

వ్యర్థాలు రోడ్లపక్కన వేయొద్దు

రామచంద్రాపురం టౌన్ జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న వ్యర్థాలు ఎక్కడపడితే పారబోయరాదని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో మార్నింగ్‌వాక్ విత్ అఫీషియల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ల పక్కన వ్యర్థాలు పారబోస్తే రోగాల బారిన పడాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

యువతకు ఉపాధినిచ్చే కోర్సులు

రామచంద్రాపురం టౌన్ జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విప్లవాత్మకంగా వస్తున్న మార్పులను యువకులు అందుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం రామచంద్రాపురం ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాన్ని కార్పొరేటర్ పుష్పానగేష్ తో కలిసి సందర్శించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం నూతన కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు.

ఒత్తిడి లేకుండా చదివితే మేలు

మునిపల్లి, జులై26 (ఆంధ్రజ్యోతి): ఏమైనా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఒత్తిడి లేకుండా చదివితే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని గీతం యూనివర్సిటీకి చెందిన సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మిప్రియాంక అన్నారు. మునిపల్లి ఆదర్శ పాఠశాలలో శనివారం మానసిక శ్రేయస్సు అనే అంశంపై చెలిమి కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మిప్రియాంక హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడి నియంత్రణకు యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. అంతకు ముందు విద్యార్థులు పలు అంశాలపై చేసిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

పాపన్నపేట జూలై 26(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పాపన్నపేట మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కమిటీ సభ్యులు భీమ్లా, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, భూషణం మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శ్రవణ్, నాయుడు, రఫీక్, పవన్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను పట్టించుకునేవారేరీ?

ఝరాసంగం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం స్లాబ్ దెబ్బతినడంతో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నీరు కారుతోంది. దీంతో స్లాబ్ పైకప్పు పెచ్చులు కూడా ఊడి, వర్షపు నీరు కార్యాలయంలోకి వస్తుంది. ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేయించలేదని తెలిపారు. వర్షం భారీగా కురిస్తే కార్యాలయం పూర్తిగా నీటితో నిండి ఉంటుందన్నారు. ఈ కార్యాలయంలో కనీసం మరుగుదొడ్లను కూడా మరమ్మతులు చేయించే వారే కరువయ్యారు. కార్యాలయ పరిసరాలను ఒక్కసారి పరిశీలిస్తే అధికారులు ఎంతమేర సబ్‌స్టేషన్‌ల నిర్వహణను పట్టించుకుంటున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



సబ్‌స్టేషన్ కార్యాలయంలో వర్షానికి పెచ్చులూడుతున్న దృశ్యం



దండుపల్లి వద్ద వర్షానికి గుంతలమయంగా మారిన రోడ్డు

నరకప్రాయం.. ఈ రోడ్డుపై ప్రయాణం

మనోహరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం జాతీయ రహదారి పక్కన దండుపల్లి నుంచి వర్గల్ వెళ్లే రెండు లైన్ల రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులకు ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ఇటీవల వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి రోడ్డు చెరువును తలపిస్తున్నది. రాత్రిపూట బైక్‌లపై వెళ్లే వాహనాదారులకు రోడ్డు కనిపించక అదుపుతప్పి తీవ్రగాయాలబారిన పడుతున్నారు. గత రెండు నెలలుగా వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే జంకే పరిస్థితి నెలకొన్నదని, అయినా సంబంధిత అధికారులు అటు వైపు చూసిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుంతల రోడ్డుపై ప్రయాణం వల్ల ప్రమాదాలు పొంచి ఉండటమే గాక, వాహనదారులకు వెన్నునొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ఫిర్యాదులపై క్షేత్రస్థాయి విచారణ

రామచంద్రాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వ్యక్తిగత, ఇతర ఫిర్యాదులపై విద్యుత్ ఉన్నతాధికారులు శనివారం క్షేత్రస్థాయి విచారణ చేశారు. జనవరి నుంచి నేటి వరకు వరుసగా విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నవారిని నేరుగా కలిసి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పరిష్కార మార్గం చూపారు. సమస్యల పరిష్కారం చూపడంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై టీజీఎస్‌పీడీసీఎల్ మేడ్చల్ ఛీఫ్ ఇంజనీర్ కామేష్, రామచంద్రాపురం ఏడీఈ నాగరాజు, ఏఈ శివశంకర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

'సెయింట్ ఆంథోనీస్'లో ఇన్వెస్టిచర్ వేడుకలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న సెయింట్ ఆంథోనీస్ విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో క్యాబినెట్ విద్యార్థుల ప్రమాణ స్వీకార వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పట్టణ సీఐ రమేశ్ మాట్లాడుతూ నాయకుడు అందరికీ మార్గదర్శకంగా ఉండాలని, నాయకత్వ లక్షణాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల క్యాబినెట్ విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఆంథోనీరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటా..

● మంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష

అల్లాదుర్గం, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోని కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తిన వారికి అండగా ఉంటానని మంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష పేర్కొన్నారు. మండలంలోని చేవెళ్ల గ్రామానికి చెందిన మంగలి నర్సింలు అనే కార్యకర్త అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. ఈ విషయాన్ని చేవెళ్ల మాజీ ఎంపీటీసీ సభ్యులు బి.చంద్రశేఖర్ త్రిష దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆమె రాజనర్సింహ ఫౌండేషన్ ద్వారా రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థికసాయం చెక్కును శనివారం ఎంపీటీసీ చంద్రశేఖర్ అతడి కుటుంబానికి అందజేశారు.

ప్రభుత్వాలు మారినా రోడ్డు వేయరా?



ఇంద్రేశం రోడ్డుపై ధర్నాచేస్తున్న బీజేపీ శ్రేణులు

పటాన్‌చెరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా రోడ్డు విషయంలో సమస్యగానే ఉంచుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని ఇంద్రేశం రోడ్డుపై ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అవుటర్ రింగు రోడ్డు నుంచి దౌల్తాబాద్, జిన్నారం, గుమ్మడిదల మండలాల వరకు రోడ్డు అధ్వానంగా ఉన్నాయని, మోకాలి లోతు గుంతలు పడ్డాయని విమర్శించారు. అదే రోడ్డుపై అధికార పార్టీ నాయకులు ప్రయాణం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేశం, జగన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో కార్గిల్‌వీరులకు నివాళులర్పిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, మాజీ సైనికాధికారులు, మహిళా డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కేడెట్లు

సంగారెడ్డి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో భద్రతను పరిరక్షిస్తున్నందుకే ఇక్కడ మనం ప్రశాంత వాతావరణంలో బతుకుతున్నామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, మాజీ సైనికాధికారులు మౌనం పాటించి వీరమరణం పొందిన సైనికులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు దేశభక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ దేశసేవలో సైనికులు చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివన్నారు. దేశభక్తిని విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికాధికారులు దశరథ్, లక్ష్మీనారాయణ, కూన వేణు తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానించి వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన తొమ్మిది పుస్తకాల కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పది ఫలితాల్లో కంది మండలం చేర్యాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించారని ప్రశంసించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, సీఎంవో వెంకటేశం, ఏఎంవో బాలయ్య, డీఎస్‌వో సిద్దారెడ్డి, ఎంఈవో జోగప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

● **సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్:** సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణబాయి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన అమర జవాన్ల త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు. ఇకతారా కళాశాలలో కార్గిల్ విజయ్‌దివస్ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. జహీరాబాద్ పట్టణంలో బీదర్ చౌరస్తా వద్ద గల అమరజవాన్ల స్థూపం వద్ద అమరులైన జవాన్లకు అభిమానులు, నాయకులు తదితరులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అభిమానులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోహీర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సుభాష్‌రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న సుభాష్‌రావు

కోహీర్, జులై 26 (ఆంధ్రజ్యోతి): 'కొత్త మునిసిపాలిటీ మురిపెం.. మున్నాళ్ల ముచ్చటేనా' అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లాకలెక్టర్ స్పందించారు. ఈ మేరకు జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సుభాష్‌రావుకు కోహీర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. కోహీర్ మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో వివిధ ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ.. కోహీర్ మున్సిపల్ పరిధిలోని ప్రజల సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బీసీ బాలుర వసతి గృహం ఆకస్మిక తనిఖీ



కానుకుంట బీసీ హాస్టల్‌లో విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న బీసీ జిల్లా సంక్షేమ అధికారి జగదీష్

గుమ్మడిదల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానుకుంట బీసీ బాలుర వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎ. జగదీష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై అభిప్రాయాలు సేకరించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ సందర్భంగా వంటగది, భోజనశాల (స్టోర్ రూమ్), విద్యార్థులకు అందించిన భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం హాస్టల్‌కు సంబంధించిన రికార్డులను కూడా సమీక్షించారు. విద్యార్థుల అడ్మిషన్స్ పెంచాల్సిందిగా వసతి గృహ సంక్షేమ అధికారి నరేష్‌కు సూచించారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

● సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా తీశారు. అదే పాఠశాలలో కంటి పరీక్షల శిబిరాన్ని పరిశీలించారు.

విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషి

● మెదక్ విద్యాధికారి రాధాకిషన్

శివ్వంపేట/నర్సాపూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి) విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని విద్యార్థులకు కనీస బోధన సామర్థ్యం నేర్పించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. శివ్వంపేట మండల పరిధిలో టొంటి ఉన్నంత పాఠశాలలో శనివారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి డీఈవో రాధాకిషన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లిష సబ్జెక్టుల్లో బేసిక్స్ బోధించడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బుచ్చ నాయక్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్ పట్టణంలోని ఎంపీపీఎస్-2 పాఠశాలలో కొనసాగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) బోధన తీరును డీఈవో రాధాకిషన్ పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థుల వర్క్‌బుక్‌లను చెక్ చేశారు. వెంట ఎంఈవో తారాసింగ్, హెచ్‌ఎం, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జిగురాకు అట్టలతో పురుగుల నివారణ

జహీరాబాద్,జూలై 26(ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో రైతులు ప్రస్తుతం జిగురాకు అట్టలను ఏర్పాటు చేసుకోవడం మూలంగాపంటలను ఆశించే దోమ, పురుగుల నివారించుకోవచ్చని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు డా.స్నేహలత, స్వామి సూచించారు. శనివారం మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో పంటల ఎదుగుదల, పురుగుల నివారణ తదితరాలపై సామూహిక ప్రదర్శనను నిర్వహించారు. సోయాబీన్ పంటను సాగుచేస్తున్న రైతులు ఎకరాకు 12చొప్పున జిగురాకు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు వివరించారు.

కస్తూర్బాలో కళాజాతా

పెద్దశంకరంపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు మెదక్ జిల్లా పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో శనివారం కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, ఉద్యోగం అవకాశాలపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమాజంలో జరిగే నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సురేందర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ గృహాలు



ఖేడ్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూలై 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు లేని అర్హులైన పేదలను గుర్తించి గృహాలు మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఈఈ తివారి, మున్సిపల్ కమీషనర్ జగ్జీవన్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, ఏఈలు పాల్గొన్నారు. కాగా ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని సేవాలాల్ చౌక్ నుంచి పంచగామ చౌక్ వరకు ఎమ్మెల్యే చొవరతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ పనులను మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మున్సిపల్ తాజామాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇతర జిల్లాల విద్యార్థులు ఎక్కువగా ఉన్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధ్యాపకులకు సూచించారు. శనివారం ఖేడ్ శివార్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆయన సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కళాశాలలో మరిన్ని కోర్సులు ప్రవేశ పెట్టే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. ఎమ్మెల్యే వెంట వెంట మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు సర్దార్‌నాయక్, కిషన్‌నాయక్, శంకర్ ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం



వెల్దుర్తి కళాశాలలో మినీ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

హత్నూర/శివ్వంపేట/వెల్దుర్తి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన హత్నూర, శివ్వంపేట, వెల్దుర్తి మండలాల్లోని జూనియర్ కళాశాలల్లో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినీ వాటర్‌ప్లాంట్లను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలకు ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు తాగునీరు లేక కొంత ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందుకోసం తనవంతుగా మండల కేంద్రాల్లోని కళాశాలలో తాను స్వచ్ఛందంగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు రాజిరెడ్డి స్పష్టం చేశారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సాధిస్తున్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా శనివారం ఆయన హత్నూర ప్రభుత్వ జూనియర్ కళాశాల, శివంపేట జూనియర్ కళాశాల, వెల్దుర్తి శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లను రాజిరెడ్డి ప్రారంభించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం శివ్వంపేటలో అనంతరం కాంగ్రెస్ నాయకుడు నవీన్ గుప్తా ఇంట్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7.50 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అలాగే వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్‌కు చెందిన లింగంకు మంజూరైన రూ.30వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

నేత్రదానంతో అంధులకు వెలుగు నింపాలి

చిన్నశంకరంపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో అంధులకు వెలుగు నింపాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. ఈ నెల 15న మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన అప్పలశెట్టి గాండ్ల ఆకాశపతి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నేత్రదాన సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన మృతి పట్ల మౌనం పాటించి కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు.

పటాన్‌చెరు మార్కెట్‌లో అవినీతి బాగోతం

(5వ పేజీ తరువాయి)

భారీ డిమాండ్ ఏర్పడింది. దుకాణాల అద్దెలు నెలకు రూ. 6 వేల నుంచి రూ. 12 వేల వరకు ఉన్నాయి. నిబంధనల ప్రకారం, ఏడాది పాటు దుకాణం తెరవకపోయినా లేదా అద్దె చెల్లించకపోయినా కేటాయింపును రద్దు చేసే అధికారం మార్కెటింగ్ అధికారులకు ఉంది. గతంలో పాలకమండలి హయాంలో సుమారు 50 దుకాణాలు ఏడాది నుంచి మూడేళ్ల వరకు తెరుచుకోకుండా ఉండటంతో వాటి లైసెన్సులను రద్దు చేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలకమండలి రద్దు కావడంతో, ఓ మార్కెటింగ్ శాఖ అధికారి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రస్తుత సూపర్‌వైజర్‌ను సెలవులో పంపి, తాత్కాలిక ప్రాతిపదికన ఆరు నెలల పాటు విధుల్లో చేరిన సదరు అధికారి, రద్దు చేసిన దుకాణాలను పునరుద్ధరించి రూ.3 కోట్ల వరకు సొమ్ము చేసుకున్నారని ఆరోపణలున్నాయి.

వ్యూహాత్మక వసూళ్లు..

రద్దైన దుకాణాల లైసెన్సుల పునరుద్ధరణకు ఒక్కో దుకాణం నుంచి రూ.12 లక్షల వరకు వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. పాలకమండలి తీర్మానం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఈ పునరుద్ధరణ జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో మార్కెట్‌శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి అధికారి శాఖాపరమైన విచారణ చేపట్టారు. అదే సమయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు కూడా ప్రత్యక్ష విచారణ జరిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పునరుద్ధరణ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన సదరు అధికారిని పటాన్‌చెరు నుంచి వ్యూహాత్మకంగా బాటసింగారం మార్కెట్‌కు బదిలీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై మార్కెటింగ్ శాఖ కార్యదర్శి మహబూబ్ స్పందిస్తూ, తాను సెలవులో ఉన్నందున ఏమి జరిగిందో తనకు తెలియదని, ఉన్నతాధికారుల విచారణ తర్వాత కార్యదర్శిని బదిలీ చేశారని తెలిపారు. ఈ అక్రమాలపై మరింత లోతైన విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆగమాగం

(5వ పేజీ తరువాయి)

ఉన్నత పాఠశాలల ఆవరణలో శనివారం వర్షపు నీరు చేరుడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పట్టణంలోని ఫుగట్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే ప్రధాన దారి బురదమయంగా మారింది. డౌన్‌టౌన్, రాంనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద, రాంనగర్-చిన్నహైదరాబాద్ గ్రామాల మధ్య రోడ్డు, అల్గోల్ చౌరస్తా-బీదర్ రోడ్లైతే పూర్తిగా దెబ్బతిన్నాయి. నారాయణఖేడ్ పట్టణంలోను ముసురు వర్షం కురుస్తుండడంతో జనాలు బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది. నారాయణఖేడ్ పరిధిలో శనివారం ఖేడ్‌లో 11.6 మిల్లీమీటర్లు, మనూరులో 14.6, కంగ్టిలో 22.8, కల్హేర్‌లో 4.8, నాగల్‌గిద్దలో 13.6, సిర్గాపూర్‌లో 23.6, నిజాంపేటలో 13.8 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. రేగోడు మండలంలో 15.4 మిల్లిమీటర్ల వర్షం కురిసిందని ఎమ్మార్వో ఫిరోజ్ తెలిపారు.

ముసురుతో రైతన్న మురిసే

రెండు నెలలుగా అడపదడపా పలకరించిన వరుణ దేవుడు ఎట్టకేలకు కరుణించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ముసురు వానలతో విజృంభించడంతో పంటలకు జీవం పోసినట్లయింది. పత్తి, కంది, మొక్కజొన్న వంటి పంటలు వాడిపోయే దశకు చేరుకోగా ఈ వానలతో ఊపిరినిచ్చినట్లయింది. దీంతో రైతులు హుషారుగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. కలుపు తీయడం, పురుగుల మందులు పిచికారి చేయడం వంటి పనులు జోరందుకున్నాయి.



జహీరాబాద్‌లో బురదమయంగా మారిన ఫుగట్‌నగర్ పాఠశాలకు వెళ్లే దారి